సాక్షి పార్వతీపురం మన్యం

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



అహో మహోదయం..!

మన్యం పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. - 8లో



యథేచ్ఛగా భూముల కబ్జా..!

రాజాం పట్టణంలో ప్రభుత్వ భూములు, చెరువులు, ఆక్రమణలకు గురవుతున్నాయి. ఆక్రమణదారులు ఇష్టానుసారం కబ్జా చేసి కోట్ల రూపాయలతో భవనాలు నిర్మిస్తున్నారు. - 8లో



డీఎస్సీలో కలపొద్దు

ఎన్నడూ లేని విధంగా గిరిజన గురుకుల ఉపాధ్యాయ జోనల్ పోస్టులు డీఎస్సీలో కలపొద్దని గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు కోరారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు గిరిమిత్రలో 'గ్రీవెన్స్'

పార్వతీపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను గిరిమిత్ర సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమీక్ష సమావేశం (డీఆర్‌సీ) కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహిస్తున్నందున గ్రీవెన్స్‌ను గిరిమిత్రకు మార్చడం జరిగిందని ఆయన వివరించారు. ప్రజలు దీనిని గమనించి తమ సమస్యలను గిరిమిత్ర సమావేశం మందిరంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద అందజేయాలని ఆయన సూచించారు.

నేడు గిరిజన జేఏసీ ర్యాలీ

సీతంపేట: అవుట్ సోర్సింగ్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీతంపేటలో సోమవారం ర్యాలీ నిర్వహించనున్నట్టు గిరిజన జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు తదితరులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ర్యాలీలో పాల్గొననున్నారని తెలిపారు. స్థానిక హైస్కూల్ నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆదివారం కూడా అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల రిలేనిరాహార దీక్షలు కొనసాగాయి. నాయకులు బి.గణేష్, ఎస్.మోహన్ రావు, బి.ధర్మారావు, కె.భవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష


పార్వతీపురం టౌన్: జిల్లాలో ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో జాతీయ ఉపకార వేతన (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసినట్టు డీఈఓ ఎన్.తిరుపతినాయుడు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన పరీక్షలో 1375 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1340 మంది పరీక్షలకు హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ పరీక్షకు సంబంధించి ప్రాథమిక కీ సోమవారం విడుదల చేసి కార్యాలయ వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో ఉంచడం జరుగుతుందని తెలిపారు. కీపై అభ్యంతరాలను ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయపు వెబ్‌సైట్‌లో గల గ్రీవెన్స్ లింకు ద్వారా ఆన్‌లైన్‌లో స్వీకరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఐటీఐలో జాబ్‌మేళా రేపు

విజయనగరం అర్బన్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన విభాగం సంయుక్త నిర్వహణలో ఈ నెల 10వ తేదీన స్థానిక ప్రభుత్వ ఐటీఐ శిక్షణా కేంద్రంలో జాబ్ మేళా నిర్వహిస్తామని నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా విద్యార్హత కలిగిన వారిని వివిధ సంస్థలలో ఖాళీ ఉద్యోగాలకు ఈ మేళాలో ఎంపిక చేస్తారని తెలిపారు. పూర్తి వివరాల కోసం 79956 91295 లేదా టోల్ ఫ్రీ 99888 53335 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంబాబు



బాధిత రైతులతో మాట్లాడుతున్న రాంబాబు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బూరాడపేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన గొర్రెలకు ప్రభుత్వం నష్ట పరిహారం ప్రకటించి పెంపకందారులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్దరాజు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం బాధిత రైతులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. వరి పంటను పురుగు ఆశించడంతో వరి కంకులు నేల రాలుతున్నాయని, వాటిని తిని గొర్రెలు మృత్యువాత పడుతున్నాయన్నారు. గంట్యాడ మండలంలోని బుడతనాపల్లిలో కూడా 10 రోజుల్లో ఎనిమిది గొర్రెలు, బొండపల్లిలో 40 గొర్రెలు, బూరాడపేటలో 90 గొర్రెలు మృతి చెందాయన్నారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

12 వరకూ వర్ష సూచన

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఖరీఫ్ పంట చేతికొచ్చే సమయంలో మరోసారి అకాల వర్షాలు పొంచి ఉన్నాయి. ఈ నెల 12వ తేదీ వరకూ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించారు. వరి కోత దశలో ఉంటే రానున్న నాలుగు రోజుల్లో కోతలు వద్దన్నారు. ఇప్పటికే కోత పూర్తి అయితే పొలాల్లోని పనలను వెంటనే ముంపులేని ప్రదేశంలో కుప్పలు పెట్టుకోవాలని సూచించారు. నూర్పు పూర్తి చేసిన రైతులు ఎవరైనా సరే ఆలస్యం చేయకుండా ధాన్యాన్ని సమీపంలోని కొనుగోలు కేంద్రానికి చేర్చాలని చెప్పారు. ధాన్యం సంరక్షణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ముందుకు సాగని పల్లె పండగ పనులు



భూమి పూజతో సరా..

పల్లె పండగలో భాగంగా వీకే పాడు అడ్వంచర్ పార్కు వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అక్టోబరు 14న భూమి పూజ చేశారు. ఈ పనులకు రూ.48 లక్షలు కేటాయించారు. నేటికీ దాదాపు రెండు నెలలవుతున్నా... నేటికీ ఈ పనులు ప్రారంభం కాలేదు. ఇదే పరిస్థితి జిల్లాలో పలు చోట్ల నెలకొంది.

- పల్లె పండగ పనులకు ఆదరణ కరువు
- అరకొరగా పనులు
- జిల్లాలో 367 పనులకు రూ.116 కోట్లు
- ముందుకు సాగని డ్రైనేజీ, రోడ్ల నిర్మాణాలు
- క్షేత్ర స్థాయిలో పనులన్నీ వెనుకడుగే..

పార్వతీపురం టౌన్: పల్లె పండగ కార్యక్రమంపై పాలకుల, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఇప్పటికే ప్రజాప్రతినిధులు, అధికారులు పల్లెల్లోకి వెళ్లి గ్రామసభల్లో తీర్మానం చేసిన పలు పనులకు శంకుస్థాపనలు కూడా చేసిన సంగతి తెలిసిందే. ఇవన్నీ సంక్రాంతి నాటికి పూర్తి కావాల్సి ఉంది. కానీ క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడంలేదు. కొన్ని చోట్ల మొదలైన పనులు అరకొరగా జరుగుతుంటే, కొన్ని ప్రాంతాల్లో అసలు ఆరంభమే కాలేదు. కొన్ని సీసీ రోడ్ల నిర్మాణం సాగుతుంటే, ఇంకొన్ని చోట్ల ఇంకా శంకుస్థాపన కూడా చెయ్యని పరిస్థితి. పనులు వేగవంతం చేయాలని ఈ నెల చివరికి పూర్తి చేయాలని జిల్లా స్థాయి అధికారులు ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు చొరవ చూపుతున్నా... కొన్ని సమస్యలు అడ్డంకిగా మారాయి... ఇసుక కొరత ఉంది. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఇప్పటికే ఎంత ఇసుక కావాలనే ప్రతిపాదన సిద్ధమైంది. కానీ ఇంత వరకు ఎవరు ఏ ర్యాంపు నుంచి ఇసుక తెచ్చుకోవాలనే దానిపై స్పష్టత లేదు. పైగా పరోక్షంగా నామినేషన్ పద్ధతిలో ఈ పనులను ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలతోనే చేయిస్తున్నారు. కొందరు ముందుగా పెట్టుబడి పెట్టడానికి చొరవ చూపకపోవడం మరో కారణం. కార్యకర్తలు, కాంట్రాక్టరుకు పనులు అప్పగించడం వల్ల ఒక పని తర్వాత మరొకటి చేసుకోవచ్చనే ధోరణి వల్ల కూడా సమస్య నెలకొంది. అన్ని గ్రామాల్లో ఒకేసారి పనులు మొదలైతే ఈ నెల చివరి వరకూ కూడా గడువు అవసరం లేకుండా పనులు పూర్తయ్యేవి. కానీ క్షేత్ర స్థాయిలో అటువంటి పరిస్థితి లేదు.

నామినేషన్ పద్ధతిలోనేనట..

ఈ పనులన్నీ నామినేషన్ పద్ధతిలో ఆయా నియోజకవర్గాల్లో కూటమి పార్టీ నేతలే చేస్తున్నట్లు సమాచారం. కార్యకర్తల పేర్లతో కాంట్రాక్టర్లు కూడా పనులు చేస్తున్నారు. జిల్లాలోని 15 మండలాల్లోనూ సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో 30వర్కులు శాంక్షన్ అయ్యాయి. పనులు మొదలైనట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కానీ చాలా పనులు మొదలు కాలేదు. కొన్నింటికి శంకుస్థాపనే చేయలేదు. కొన్ని పనులకు సంబంధించి రోడ్లను శుభ్రం చేశారు. కొంత మట్టి వర్కు చేశారు. కంకర లేయర్లు వేశారు. కొన్నిచోట్ల సీసీ రోడ్లు వేశారు. కొన్నిచోట్ల ఆల్టర్నేట్ రోడ్లను ప్రతిపాదించారు.

పనుల్లో నిర్లక్ష్యం

గ్రామాల్లో అభివృద్ధికి నిధులు విడుదల చేసినా పనులు మాత్రం నిర్లక్ష్యంగా సాగుతున్నాయి. అయినా పట్టించుకునేవారే లేరు. ప్రారంభమైన పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు 20 రోజుల తరువాత చూస్తారట. గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించాలన్నది లక్ష్యం. ప్రాధాన్యతను బట్టి పనులు కేటాయించారు. జిల్లాలో సీసీ రోడ్లు నిర్మాణానికి ఒక్క కిలో మీటరుకు రూ.25 లక్షల వరకు అంచనా వేశారు. బీటీ రోడ్డుకు కిలోమీటరుకు రూ.80 లక్షల వరకు అంచనా వేశారు. ఉపాధి హామీ పథకం నిబంధనల ప్రకారం 125 అడుగుల రోడ్డు నిర్మించాలి. ఇంకా 1నుంచి 3శాతం వరకు ప్రజాప్రతినిధులు, ప్రజల కోరిక మేరకు నిర్మించవచ్చు. ఏడు అంగుళాల నుంచి 8 అంగుళాల మందం ఉండేలా చూడాలి.



శంకుస్థాపన జరిగినా..

పార్వతీపురం మండలం అడ్డాపుశీల – పిన్నింటి రామినాయుడువలస మధ్య రెండు కిలోమీటర్ల రోడ్డుకు అక్టోబర్ 16న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శంకుస్థాపన చేశారు. ఈ పనులకు రూ.75 లక్షలు కేటాయించారు. అయితే నేటి వరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

జిల్లాకు 367 పనులు

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాకు మొత్తం 367 పనులు మంజూరయ్యాయి. వీటి కోసం రూ.116కోట్ల విలువైన పనులకు డ్రైన్లు, రోడ్లకు శాంక్షన్ చేశారు. కానీ సాంకేతిక కారణాలతో పనులు చాలా చోట్ల ఇంకా ప్రారంభం కాలేదు. పలుచోట్ల ప్రారంభమైన పనులు నత్తనడకన సాగుతున్నాయి.

చర్యలు చేపట్టాం

పల్లె పండగ కార్యక్రమంలో మంజూరైన పనులు వేగవంతం చేసే విధంగా చర్యలు చేపట్టాం. ప్రారంభించిన పనులు ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రారంభం కాని పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు వేగవంతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నాం.

– రవి, డీపీఆర్ఈఓ, పార్వతీపురం మన్యం

రైతు ఇంట... బెల్లం పంట



చిన్నబెల్లం దిమ్మలు

- తప్పనిసరి పరిస్థితుల్లో క్రషర్లకు విక్రయం
- మార్కెట్‌లో 100 కేజీల బెల్లం హోల్‌సేల్ ధర రూ.440లు
- జిల్లాలో 40 బెల్లం క్రషర్లు
- టన్ను చెరకకు 115 కేజీల బెల్లం దిగుబడి



చెరకు గానుగాడుతున్న కూలీలు



తాయిల్లో మరుగుతున్న చెరకు రసం

సీతానగరం: జిల్లాలో రైతులు వాణిజ్య పంటగా చెరకును సాగు చేస్తున్నారు. రైతులు పండించిన చెరకు కొనుగోలు చేయడానికి ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం ఈ ప్రాంతంలో నిర్మించారు. కర్మాగారం పరిధిలో ఉన్న మండలాల్లో 13 వేల మంది రైతులు 20 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు పంట సాగు చేయడం వల్ల 4 లక్షల టన్నుల చెరకు ప్రతి ఏటా ఉత్పత్తి జరిగేది. ఈ క్రమంలో లచ్చయ్యపేట ఎన్‌సీఎస్ కర్మాగారం రెండేళ్లుగా మూతపడింది. దీంతో ఇక్కడి రైతులు చెరకును సంకిలి ఈఐడీ ప్యారీస్ చక్కెర కర్మాగారానికి తరలించాల్సి ఉన్నందున.. ఈ కర్మాగారం దూరం కావడంతో చెరకు సాగుకు ఆసక్తి చూపడం లేదు. అలవాటును మానుకోలేని చిన్న, సన్నకారు చెరకు రైతులు ప్రోత్సాహంతో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వర్తకులు బెల్లం క్రషర్లను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరు రైతుల నుంచి చెరకు కొనుగోలు చేసి క్రషర్లు నెలకొల్పి బెల్లం వ్యాపారాలు చేస్తున్నారు. తూర్పుగోదావరి, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి వచ్చిన వ్యాపారస్తులు బెల్లం క్రషర్లు నెలకొల్పారు.

ఎన్‌సీఎస్ కర్మాగారం మూతపడక ముందు 6 లక్షల టన్నుల చెరకు ఉత్పత్తి జరిగేది. కర్మాగారం మూతతో చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. 2024 – 25 క్రషింగ్ సీజనులో ఆయా మండలాల రైతులు లక్షా 50 వేల టన్నుల చెరకు ఉత్పత్తి చేసారు. సీతానగరం మండలంలో 95 వేల టన్నుల చెరకు ఉత్పత్తి జరిగింది.

ఎన్‌సీఎస్ కర్మాగారం పరిధిలో ఉన్న బాడంగి, బొబ్బిలి, తెర్లాం, సీతానగరం, రామభద్రపురం, మక్కువ తదితర మండలాల్లో 40 బెల్లం క్రషర్లు పని చేస్తున్నాయి. రోజుకు ఒక్క క్రషరులో బెల్లం తయారు చేయడానికి 6 నుంచి 8 టన్నుల చెరకు అవసరం అవుతుంది. 40 క్రషర్లకు రోజుకు 300 టన్నుల చెరకు బెల్లం తయారీకి అవసరం అవుతుంది. రైతులు తమ కుటుంబ సభ్యులతో పొలంలో చెరకు నరికి క్రషర్లకు సరఫరా చేస్తున్నారు. బెల్లం క్రషర్ల నిర్వాహకులు రైతుల నుంచి టన్ను చెరకు రూ.2,450 నుండి 2,600 వరకూ కొనుగోలు చేస్తున్నారు.

బెల్లానికి గిరాకీ

క్రషర్లు ఏర్పాటుకు చెరకు పండించిన నేలలు అనుకూలంగా ఉన్నందున నాణ్యమైన బెల్లం తయారీకి సహాయ పడుతుంది. బెల్లం క్రషర్ల నిర్వాహకులు ఇక్కడి రసాయనాలు వేయకుండా తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన బెల్లాన్ని విజయవాడ, రాజమండ్రి, గుంటూరు ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇందులో సగ భాగం బెల్లం ఒడిశా, రాయ్‌పూర్, జగదల్‌పూర్, నవరంగ్‌పూర్ ప్రాంతాల వారు ఎక్కువ కొనుగోలు చేస్తూ తమ వ్యాపారాలు సాగిస్తున్నారు.

బెల్లం తయారీకి అనుకూల వాతావరణం



క్రషింగ్ ప్రారంభించిన సమయానికి వాతావరణం అనుకూలించడంతో బెల్లం దిగుబడితో పాటు ఆకర్షణీయమైన రంగుతో బెల్లం తయారు కావడంతో పలు ప్రాంతాల వారు ఇక్కడి నుంచే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. స్థానికంగా బెల్లం విక్రయాలు జరగడం వలన ఎటువంటి ఇబ్బందుల్లేకుండా వ్యాపారాలు సాగుతున్నాయి. రైతులకు చెరకు ధర గిట్టుబాటు కావాలి.

– ఆర్.ఈశ్వరరావు, రైతు సంఘం నాయకుడు

పంట పొలాల్లో గజరాజులు



జియ్యమ్మవలస మండలం పెదకుదమ పంట పొలాల్లో ఆదివారం గజరాజులు దర్శనమిచ్చాయి. ఉదయం అరటి, పామాయిల్ తోటల్లో ఉన్న ఏనుగులు మధ్యాహ్నం వరి పంట పొలాల్లోకి వెళ్లాయి. వీటి సంచారంతో పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంటలను గజరాజులు ధ్వంసం చేస్తుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- జియ్యమ్మవలస

● జంఝావతి జంఝాటం వీడేంత వరకు పోరాటం



ఐదు దశాబ్దాలుగా రైతును ఊరిస్తున్న జంఝావతి జంఝాటం వీడేంత వరకు పోరాటం చేయాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నిర్ణయించింది. పార్వతీపురం పట్టణంలోని ఏపీఎన్‌జీఓ హోంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల మాలతి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ పాలకులు, అధికారుల్లో చిత్తశుద్ధి లేకపోవడంతోనే ఐదు దశాబ్దాలుగా జంఝావతి సమస్య అలానే మిగిలిపోయిందన్నారు. ఏపీలో, ఒడిశాలో, కేంద్రంలో సానుకూల ప్రభుత్వాలు ఉండడం వల్ల సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో పలు సంఘాల నాయకులు వంగల దాలినాయుడు, చుక్క భాస్కరరావు, మండల పకీరునాయుడు, శ్రీహరి, ఎం.ఈశ్వరరావు, సీహెచ్ వెంకటనాయుడు, వి.శివకృష్ణ, వలిరెడ్డి కృష్ణ, సీహెచ్ హరి, రాగోలు సర్వేశ్వరరావు, బడే మృత్యుంజయరావు, మాన్యం రామకృష్ణ, చుక్క చంద్రరావు, బి.కృష్ణ, ఎస్.భాస్కరరావు, దేవుపల్లి సీతారాం, కోరాడ కాశీకుమార్ పాల్గొన్నారు.

- పార్వతీపురం టౌన్

మార్కెట్‌లోకి వచ్చేసిన ఉసిరి



వ్యాపారులు కొనుగోలు చేసిన ఉసిరి

- సీజన్ ప్రారంభం
- మన్యంలో వెయ్యి ఎకరాల్లో సాగు
- తగ్గిన దిగుబడి
- కావిడ ఉసిరి రూ.900ల వరకు విక్రయం

సీతంపేట: సీతంపేట మన్యంలో పండించే ఉసిరి మార్కెట్లోకి వచ్చేసింది. కొండపోడు వ్యవసాయంలో సాగు చేసి ఈ సీజన్‌లో విస్తృతంగా గిరిజనులు ఉసిరిని సేకరించి మార్కెట్‌కు తీసుకువస్తారు. మైదాన ప్రాంతాలకు చెందిన వ్యాపారులకు గిరిజన రైతులు ఉసిరిని విక్రయిస్తారు. అంతగా పెట్టుబడులు అక్కర్లేక పోయినప్పటికి ఏజెన్సీలో సుమారు వెయ్యి ఎకరాల్లో ఈ పంటను కొండపోడు వ్యవసాయంలో భాగంగా పండిస్తారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం దిగుబడులు కాస్తా తగ్గాయని రైతులు చెబుతున్నారు. కావిడ ఉసిరి క్కాయలు రూ.900ల వరకు ధర పలుకుతుంది. సరాసరి రూ.30 నుంచి 40 వరకు కిలో ఉసిరి గిట్టుబాటు అవుతుందని గిరిజనులు తెలిపారు. గతేడాది ఇదే సీజన్లో ఒక్కో కావిడ ఇదే ధరలకు విక్రయించినట్టు గిరిజనులు తెలిపారు.

ఇదీ పరిస్థితి...

ఇక్కడ కొనుగోలు చేసిన ఉసిరిని వ్యాపారులు పట్టణాల్లో అధికంగా విక్రయించి లాభాలను ఆర్జిస్తారు. ఖమ్మం, తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి ఉసిరిని కొనుగోలు చేస్తారు. పచ్చళ్ల, ఆయిల్ కంపెనీలకు వీటిని సరఫరా చేస్తారు. సీతంపేటలో సోమవారం, మర్రిపాడులో బుధవారం, గురువారం దోనుబాయిలో కుశిమి, పొల్ల గ్రామాల్లో శనివారం వారపు సంతలు జరుగుతాయి. ఈ సంతలకు వ్యాపారులు వచ్చి ఉసిరిని అధిక మొత్తంలో కొనుగోలు చేస్తారు. గిరిజన రైతులు చెప్పిన ధరలు కాకుండా వ్యాపారులు సిండికేట్‌గా మారి కొన్ని సందర్భాల్లో ధర నిర్ణయిస్తారు. దీంతో వారు చెప్పిన ధరలకు ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని గ్రామాల్లో గిరిజనులు ముందుగా దళారీ వ్యాపారుల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుంటారు. పంట పక్వానికి వచ్చే సమయంలో ఆ పంటను వ్యాపారులకు ఇస్తారు. ఇలా కూడా గిరిజనులు నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. పచ్చి ఉసిరిని కాకుండా ఎండు ఉసిరిని మాత్రమే గిరిజన సహకార సంస్థ కొనుగోలు చేసింది. పచ్చి ఉసరిని మైదాన వ్యాపారులు కొనుగోలు చేయడంతో వారికే విక్రయిస్తున్నామని గిరిజనులు చెబుతున్నారు. ఉసిరిని ఎండబెట్టి విక్రయించాలంటే చాలా సమయం తీసుకుంటుందని గిరిజనులు చెబుతున్నారు. పోని కోల్డ్ స్టోరేజి వద్ద నిల్వ చేసి ఉంచి లాభాలు వచ్చినపుడు అమ్మకాలు చేద్దామనుకున్న అటువంటి సదుపాయాలు కూడా లేవు.



సంతలో బుట్టలతో ఉసిరిని విక్రయిస్తున్న గిరిజనులు

ఆరోగ్య ప్రదాత...

ఉసిరిని ఆరోగ్య ప్రదా1తగా అందరూ భావిస్తారు. ఆయుర్వేదంలో దీనికి ఎంతో ప్రాధాన్యత ఉందని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో కాల్షియం, ఐరన్, ప్రోటీన్లు, పాస్పర్, కార్బోహైడ్రేట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా జ్ఞాపకశక్తిని పెంచి తెలివి తేటలను ఇనుమడింపచేసేందుకు ఉసిరి దివ్యమైన ఔషధంగా పని చేస్తుంది. ఉసిరి కాయలతో ఊరగాయ పెట్టుకుని అప్పుడప్పుడు తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరంలో వేడిని తగ్గించి జలుబు, కోరింత దగ్గును నయం చేసే శక్తి ఉంది. అంతేకాకుండా పేగుల్లో మంటను ఆరికడుతుంది. జీర్ణ ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఉసిరిని కలిపిన నూనెను వాడితే జుట్టు నిగనిగలాడడంతో పాటు చుండ్రు, వెంట్రుకలు రాలడం తగ్గుతాయి. పలు హెయిర్ ఆయిల్స్‌లో ఉసిరి గుణాలు ఉన్నాయంటూ ప్రచారం చేసుకుని వ్యాపారులు అమ్మకాలు పెంచుకునేందుకు ఉసిరి వాడుకుంటున్నారు. ఉసిరితో తయారు చేసిన టానిక్ ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు.

గిట్టుబాటు ధరలు వస్తాయని ఆశిస్తున్నాం



ఈ ఏడాది ఉసిరికి గిట్టుబాటు ధరలు వస్తాయని ఆశిస్తున్నాం. పంట కూడా బాగానే ఉంది. ఇటీవల నేను కొన్ని ఉసిరికాయలను బయట మార్కెట్లో విక్రయించాను. వెయ్యి రూపాయిలు వరకు ఆదాయం వచ్చింది.

– చిన్నయ్య, ఈతమానుగూడ

సేకరణ కష్టం



ఉసిరి సేకరణ చాలా కష్టసాధ్యమైన పని. పైనాపిల్, సీతాఫలం వంటి పంటల తర్వాత అతి ముఖ్యమైన పంట ఇది. అంతగా పెట్టుబడులు అవసరం లేకపోయినప్పటికీ పంట దిగుబడి వస్తుంది

– ఎస్.గయ్యారమ్మ, వలగజ్జిగూడ

క్లుప్తంగా

రాముడి దర్శనానికి పాదయాత్రగా భక్తులు



తంగుడుబిల్లి వద్ద పాదయాత్రలో భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దర్శనానికి శ్రీకాకుళం జిల్లా భక్తులు పాదయాత్రగా ఆదివారం తరలివచ్చారు. లావేరు, వెంకటాపురం నుంచి సుమారు 200 మంది భక్తులు 45 కిలోమీటర్లు కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారి శ్రీరామ నామ స్మరణతో మార్మోగింది. ప్రతి ఏటా స్వామి దర్శనానికి కాలినడకన రావడం ఆనవాయితీగా వస్తోందని ఆ భక్తులు తెలిపారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పట్టణంలోని ఓ పరీక్ష కేంద్రంలో డీఈఓ మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్: జిల్లాలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న 3,902 విద్యార్థుల్లో 96.43 శాతంతో 3,763 మంది హాజరయ్యారని డీఈఓ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. పరీక్షా కేంద్రాలను డీఈఓ మాణిక్యం నాయుడు, డీసీఈబీ సెక్రటరీ టి.సన్యాసిరాజులతో పాటు 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సందర్శించాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్ చక్రవర్తి (ఫైల్)

వీరఘట్టం: మండలకేంద్రానికి చెందిన కూర్మాన అశోక్ చక్రవర్తి(35) ఇదే మండలంలోని వండవ గ్రామ సమీపంలో జరిగిన ప్రమాదంలో రోడ్డుపై మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా భార్యాపిల్లలతో పాలకొండలో నివాసముంటున్న అశోక్ చక్రవర్తి ఆదివారం ఉదయం వీరఘట్టం వచ్చి మిత్రులు, తల్లిదండ్రులు, అత్తమామలతో సరదాగా గడిపి తిరుగు ప్రయాణంలో రాత్రి 8 గంటలకు పాలకొండ వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రమాదానికి గురై రోడ్డుపై రక్తపు మడుగులో పడిఉన్నాడు. ఈ సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించలేక అదుపు తప్పి రోడ్డుమీద పడిపోయి మృతిచెందాడా? లేదా గుర్తు తెలియని వాహనం ఏదైనా ఢీకొని మృతిచెందాడా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి భార్య దివ్య, ఇద్దరు చిన్నపిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతవద్ద ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి తెలిపారు. దీనికి సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వంగర గ్రామానికి చెందిన కొలుసు రమణ (51) శనివారం ఉదయం గొర్రెలను విక్రయించేందుకు పెదమానాపురం సంతకు తోలుకొని వస్తున్న సమయంలో పార్వతీపురం నుంచి విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో రమణకు తీవ్ర గాయాలు కావడంతో విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య పైడమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తి..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని అక్షర పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 5వ తేదీన సీసీ కెమెరాలు బిగించేందుకు వచ్చిన పాలక మురళీధర్ విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయాలపాలైన సంగతి విదితమే. అయితే మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం తరలించగా కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ సంఘటనపై మృతుడి తమ్ముడు పాలక సురేష్ కుమార్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు కురుపాం ఎస్సై పి.నారాయణరావు పేర్కొన్నారు. మృతుడి స్వగ్రామం ఒడిశాలోని రాయగడ అని ఎస్సై తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹210



జలవిహార్‌లో బోటుషికారు చేస్తున్న పర్యాటకులు

అందాలలో అహో మహోదయం..!



మెట్టుగూడ జలపాతంలో పర్యాటకులు

• మన్యంలో పర్యాటకుల సందడి

సీతంపేట: మన్యం పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలంలోని మెట్టుగూడజల పాతంతో పాటు స్థానిక అడ్వెంచర్ పార్కుకు పర్యాటకులు వచ్చి వివిధ సాహస క్రీడల్లో పాల్గొన్నారు. జలవిహార్‌లో బోటు షికారు, ఫైవ్ డి థియేటర్‌లో అడ్వెంచర్ మూవీ చూశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడవడం, చిన్నారుల బొమ్మ రైలు ఎక్కి ఆటలతో సందడి చేశారు.



పార్కులో స్టెప్పులు వేస్తున్న యువత



ఫైవ్ డి థియేటర్‌లో అడ్వెంచర్ మూవీ చూస్తున్న పర్యాటకులు



స్కై సైకిల్ తొక్కుతున్న యువకులు



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న బాలికలు

కాలం చెల్లిన గిరివిహార్

స్థానిక అడ్వెంచర్ పార్కులో ఆల్‌టర్న్ వెహికల్ (ఏటీవీ) మూలన పడింది. ఇక్కడికి వచ్చే పర్యాటకులకు వినోదాన్ని అందించడానికి వీలుగా గతంలో దీన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు ఆల్‌టర్న్ వెహికల్స్ ఉండేవి. వాటిలో ఏదీ పనిచేయకపోవడంతో మూలనపడేశారు. పార్కులో వాటితో పర్యాటకులు తిరిగి వినోదం పొందేందుకు రూ.300 వరకు ఒక్కొక్కరి వద్ద టిక్కెట్ తీసుకునేవారు. తద్వారా పార్కుకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం ఇవి తిరగకపోవడంతో ఇటు టూరిస్టులకు వినోదం లేకపోగా, పార్కు ఆదాయానికి గండిపడింది. అలాగే గిరి విహార్ పేరిట రెండు జీపులు వివిధ ప్రదేశాలు తిరిగేవి. వాటికి కూడా కాలం చెల్లడంతో మూలనపడి ఉన్నాయి. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాటి కాలం అయిపోయినట్లు ధ్రువీకరించారు. వాటి స్థానంలో కొత్త వెహికల్స్ పెట్టకపోవడంతో మండలంలో ఉన్న ప్రదేశాలు చుట్టిరావడానికి పర్యాటకులకు అవస్థలు తప్పడం లేదు. మెట్టుగూడ, ఆడలి, జగతపల్లి వంటి ప్రాంతాలకు పర్యాటకులు తమ వాహనాల్లో వెళ్తున్నారు. గిరివిహార్ వాహనాలు ఉంటే దూరానికి లెక్క కట్టి డబ్బులు చెల్లించి తిరిగే వారు. ఇప్పుడు ఎటువంటి వాహనాలు లేవు. ఆకాశంలో విహరించడానికి గతంలో పారామోటరింగ్ ఏర్పాటు చేశారు. ఇందుకుగాను యువకులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. దీని నిర్వహణ సరిగా లేకపోవడంతో పక్కన బెట్టేశారు.



మూలపడిన ఆల్‌టర్న్ వెహికల్స్



కాలం చెల్లిన గిరివిహార్ వాహనాలు



పారామోటర్ పరిస్థితి ఇది

యథేచ్ఛగా భూముల కబ్జా..!

• రోడ్డువేసి ఆక్రమణలు
• పెట్రేగిపోతున్న ఆక్రమణదారులు



రాజాం జీఎంఆర్‌ఐటీ సమీపంలో ఉమామహేశ్వర లక్ష్మీ నారాయణ దేవస్థానం భూముల్లో కొత్తగా వేసిన రోడ్డు



జీఎంఆర్ ఐటీ ఎదురుగా చెరువును కప్పేస్తున్న కబ్జాదారులు

రాజాం: రాజాం పట్టణంలో ప్రభుత్వ భూములు, చెరువులు, ఆక్రమణలకు గురవుతున్నాయి. ఆక్రమణదారులు ఇష్టానుసారం కబ్జా చేసి కోట్ల రూపాయల భవనాలు నిర్మించి, అద్దెల రూపంలో అక్రమార్జనచేస్తున్నారు. కబ్జాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆస్తులు పరిరక్షించాల్సిన అధికారులు మౌనంగా ఉండడంతో ఆక్రమణదారులు పెట్రేగిపోతుండడంతో చివరకు శ్మశానవాటికలు, సాగునీటి చెరువులు, దేవదాయ శాఖ భూములు సైతం కనుమరుగవుతున్నాయి.

స్వాహా దిశగా ఆరున్నర ఎకరాలు

రాజాం జీఎంఆర్‌ఐటీ సమీపంలో రాజాం ఉమామహేశ్వర లక్ష్మీనారాయణ దేవస్థానానికి సర్వే నంబర్ 94లో 1 నుంచి 25 వరకు 6.21 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో ఈ భూమిలో కొంతమేర ఆక్రమణలు ఉండేవి. ఇప్పుడు మొత్తం ఆరెకరాలు ఆక్రమణలకు గురవుతోంది. ఇక్కడ సెంటు భూమి ధర రూ.1 కోటికి పైగా చేస్తుంది. ఎకరా స్థలం రూ.100 కోట్లు విలువచేస్తుంది. ఆక్రమణదారులు ఇక్కడ భవంతులు నిర్మించి, వాటిలో ఒక్కో గదిని నెలకు రూ.25 వేల నుంచి రూ.40 వేలు వరకూ అద్దెలు పొందుతున్నారు. దేవదాయశాఖ భూముల్లో ఆక్రమణలు జరుగుతున్నా అటు దేవాదాయశాఖ, ఇటు రెవెన్యూశాఖ పట్టించుకోకపోవడం ఒక ఎత్తు కాగా, షాపులు నిర్మాణానికి, భవంతులు నిర్మించుకోవడానికి మున్సిపల్ శాఖ నుంచి అనుమతులు రావడం, వారికి విద్యుత్ మీటర్లు సైతం పక్కా ఆధారాలుతో లభించడం మరో ఎత్తు. మరో వైపు జీఎంఆర్‌ఐటీ ఎదురుగా పాలకొండ రోడ్డులో సంతకవిటి మండలం పొనుగుటివలస గ్రామానికి చెందిన 30 సెంట్ల సాగునీటి కోనేరు ఇటీవల ఆక్రమణకు గురైంది. ఈ ప్రాంతంలో చెరువు భూమి రూ.30 కోట్లకు పైగా విలువచేస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మొన్నటివరకూ ఇక్కడ జీఎంఆర్ నిర్మించిన బస్‌షెల్టర్ ఆక్రమణదారులకు అడ్డుగా ఉండేది. ఇటీవల రోడ్డు విస్తరణలో ఈ బస్ షెల్టర్ తొలగించడంతో ఆక్రమణదారులు చెరువులో మట్టివేసి చెరువు మొత్తాన్ని కబ్జాచేస్తున్నారు. దీంతో ఈ చెరువు ద్వారా కాస్తో...కూస్తో సాగునీరు అందే పంటపొలాలుకు చుక్కనీరు కూడా అందని పరిస్థితి కనిపిస్తోంది. జీఎంఆర్‌కేర్ రోడ్డులో డోలపేట వద్ద శ్మశానవాటిక చుట్టు పక్కల ఇటీవల ఆక్రమణలు అధికమయ్యాయి. వాటిని నియంత్రించాల్సిన రెవెన్యూశాఖ ఇంతవరకూ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆక్రమణలు వాస్తవమే

రాజాంలో ఉమామహేశ్వర లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం భూములు డోలపేట పరిధిలో అనేకం ఉన్నాయి. రాత్రికిరాత్రే ఆక్రమణలకు పాల్పడుతున్నారు. జీఎంఆర్ ఐటీ సమీపంలో ఆక్రమణలు వాస్తవమే. ఆక్రమణదారులకు నోటీసులు కూడా ఇచ్చాం. వారు వచ్చి తమకు ఏవో కాగితాలు ఉన్నాయని మొండికేస్తున్నారు. ఉన్నతాధికారులకు సమస్యను వివరించాం.

– బీవీ మాధవరావు, దేవాదాయశాఖ మేనేజర్, రాజాం

అధికారుల కనుసన్నల్లోనే

పాలకొండ రోడ్డులో జీఎంఆర్‌ఐటీ ఎదురుగా సాగునీటి కోనేరు సంతకవిటి మండల పరిధిలో ఉందని, ఈ ఆక్రమణపై సంతకవిటి తహసీల్దార్ కార్యాలయానికి ముందుగానే ఫిర్యాదు అందినట్లు పొనుగుటివలస రైతులు వాపోతున్నారు. ఆ చెరువు ఆక్రమణలను ఇంతవరకూ అడ్డుకున్నామని, ప్రస్తుతం అధికారుల అండదండలు ఆక్రమణదారులకు ఉండడంతో ఏమీచేయలేని పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

45 ప్లస్‌లో విజేత విజయనగరం



బహుమతి అందుకుంటున్న క్రీడాకారులు

విజయనగరం: జీవీకే ఆలిండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి టెన్నిస్ పోటీల్లో విజయనగరం ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారులు 45 ప్లస్ విభాగంలో విజేతలుగా నిలిచారు. డబుల్స్‌లో ప్రాతినిధ్యం వహించిన సౌమిత్రి, దినకర్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. విజయకేతనం ఎగురవేసిన సౌమిత్రి జోడీకి విజయనగరం టెన్నిస్ క్రీడాకారులు సుధ, నరసింహ, మహేష్, వేణు, డాక్టర్ రాజేశ్, ప్రశాంత్,మల్లికార్జున్, ముత్తు, చిన్న అభినందనలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ

• విద్యార్థులను అభినందించిన హెచ్ఎ, ఉపాధ్యాయులు



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రగ్బీ పోటీల్లో వివిధ కేటగిరిల్లో ప్రథమ బహుమతులు సాధించిన జట్లలో బొండపల్లి మండలంలోని రాచకిండాం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్కూల్ హెచ్ఎం టి.సన్యాసిరాజు తెలిపారు. ఇటీవల కడపలో జరిగిన అండర్14-బాలుర విభాగంలో ఇద్దరు, బాలికల విభాగంలో ఐదుగురు పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అలాగే గుంటూరులో జరిగిన అండర్-17 విభాగంలో బాలుర విభాగంలో ముగ్గురు విద్యార్థులు, కాకినాడలో జరిగిన అండర్17 బాలికల విభాగంలో ఇద్దరు విద్యార్థినలు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఇంతమంది విద్యార్థులు రాచకిండాం స్కూల్ నుంచి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచడంతో వారందరినీ హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించడంతో పాటు సత్కరించారు.

అథ్లెట్స్‌కు ఆర్థిక సహాయం



అథ్లెట్స్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం: ఈ నెలాఖరులో రాంచీలో జరగనున్న 68వ అండర్ 19 ఎస్జీఎఫ్ జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన టి.పాల్‌రాజ్, ఎ.యశోద అనే ఇద్దరు క్రీడాకారులకు 'ది గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ ఫౌండేషన్' రూ.5000 ఆర్థిక సహాయం అందించింది. ఆ సంస్థ సభ్యుడైన సీనియర్ బాడ్మింటన్ క్రీడాకారుడు స్వర్గీయ చాగంటి విజయకుమార్ జ్ఞాపకార్థం ఈ విరాళం అందించారు. కార్యక్రమంలో చారిటబుల్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సూర్యలక్ష్మి, సహాయ కార్యదర్శి హరిగోపాల్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీలో కలపొద్దు

• ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విజ్ఞప్తి



పార్వతీపురం టౌన్: మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న రిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు



సాలూరు: సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు



గుమ్మలక్ష్మీపురం: అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తూ నిరసన తెలుపుతున్న గురుకులాల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

పార్వతీపురంటౌన్: ఎన్నడూ లేని విధంగా గిరిజన గురుకుల ఉపాధ్యాయ జోనల్ పోస్టులు డీఎస్సీలో కలపొద్దని గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వెంకట్, కామేష్, రాజేష్, దీపకుమారి, వసుంధర తదితరులు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి వెళ్లి అడిగితే గత ప్రభుత్వంలో పోరాటం చేయలేదని అంటుంటారని, ఇంతకుముందు జరిగిన ఏ డీఎస్సీలోనూ తమ పోస్టులు కలపలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో తమ పోస్టులను కలపడం వల్లే పోరాటం చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే జరిగితే ఉద్యోగం కుటుంబాలతో రోడ్డున పడతామని వాపోయారు. కొన్నేళ్లుగా చాలీచాలని జీతాలతో గిరిజన విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నామని, ఉద్యోగ భద్రత కావాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తమను సీఆర్‌టీలుగా మార్చాలని కోరారు. వారికి చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు, పౌరహక్కుల కమిటీ అధ్యక్షుడు వంగల దాలినాయుడు మద్దతు తెలిపారు.

సాలూరులో..

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు గిరిజన గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు కోరుతున్నారు.ఈ మేరకు ఆదివారం సాలూరు, కురుపాం నియోజకవర్గాల్లో పనిచేస్తున్న పలువురు గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు సాలూరు పట్టణంలో సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

గుమ్మలక్ష్మీపురంలో..

గుమ్మలక్ష్మీపురం: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపాదికన పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్, పీఆర్‌టీయూ, ఏపీ గిరిజన సంఘం, గిరిజన స్టూడెంట్ యూనియన్ తదితర సంఘాల నాయకులు కె.భాస్కరరావు, పి.ప్రసాద్,పి.శంకరరావు, జి.సత్యభగవాన్, ఎన్.గోపాల్‌రావు, కె.కామేష్, ఎం.సన్యాసి, డి.సురేష్ తదితరులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వి.ప్రసాదరావు

రామభద్రపురం: మండలకేంద్రంలోని మారుతి కాలనీలో ఆదివారం వేకువజామున ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై ఎస్సై వి.ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రానికి చెందిన షేక్ బాబ్జీ (42) కుటుంబంలో ఆదివారం శుభకార్యం ఉండడంతో శనివారం రాత్రంతా పనుల్లో సహాయం చేశాడు. బాబ్జీకి 24 గంటలూ మద్యం తాగడం సేవించడం అలవాటు ఉండడంతో శనివారం రాత్రి ఎక్కువగా తాగాడు. రోజూ ఎక్కువగా తాగుతుండడంతో కుటుంబసభ్యులు మందలించగా మనస్తాపానికి గురైన బాబ్జీ ఉరివేసుకున్నాడు. సమాచారం మేరకు ఆదివారం ఉదయం ఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భగవద్గీత శ్లోక పోటీలకు విశేష స్పందన



భగవద్గీత పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

విజయనగరం టౌన్: స్థానిక టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత శ్లోక పఠన పోటీలకు విశేష స్పందన లభించింది. జూనియర్, సీనియర్ విభాగాల్లో సుమారు వంద మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీటీడీ ప్రోగ్రామింగ్ మేనేజర్ జె.శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో సీనియర్ విభాగంలో కె.వైష్ణవి ప్రథమ, ఎస్.కోటకు చెందిన ఎమ్.రామ హర్షితకు ద్వితీయ, ఎస్.శ్రీదేవికి తృతీయ బహుమతి లభించాయన్నారు. జూనియర్ విభాగంలో ఎస్.కోటకు చెందిన జి.ప్రణవసాయికి ప్రథమ, గర్భాం గ్రామానికి చెందిన ఎస్.మోక్షప్రియకు ద్వితీయ, తిప్పలవలసకు చెందిన డి.భాగ్యశ్రీకి తృతీయ బహుమతి లభించినట్లు వివరించారు. పోటీకి న్యాయనిర్ణేతలుగా కె.శ్రీనివాసాచార్యులు, ఎస్.శ్రీనివాసరాజు, బీఏ.రవికుమార్‌లు వ్యవహరించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

సంతకవిటి: మండల పరిధిలోని ఇజ్జిపేట గ్రామంలో ధాన్యం బస్తాలతో వస్తున్న ట్రాక్టర్ ఆదివారం బోల్తా పడింది. రోడ్డు బాగోలేక పోవడంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడినట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా రహదారి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి నష్టం సంభవించక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.